సాక్షి
ములుగు

బుధవారం । 16 । అక్టోబర్ । 2024



రామప్ప ఖ్యాతి ప్రపంచానికి చాటాలి

రామప్ప ఆలయ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని కలెక్టర్ దివాకర పిలుపునిచ్చారు. వరల్డ్ హెరిటేజ్ క్యాంపెయినింగ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. - 10లో▸



వరంగల్ మార్కెట్‌లో అంతర్గత బదిలీలు.. - 10లో▸

ఏనుమాముల మార్కెట్‌లో పెద్ద ఎత్తున అంతర్గత బదిలీలు చేస్తూ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి నిర్మల ఉత్తర్వులు జారీ చేశారు.

గరిష్టం/కనిష్టం
$33.3^0/25.1^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రిన్సిపాల్‌గా దేవకికి అదనపు బాధ్యతలు



ములుగు రూరల్: మండల పరిధిలోని బండారుపల్లి మోడల్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శోభారాణి బదిలీ కాగా సీనియర్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న దేవకికి ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు శ్రీనివాస చారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం దేవకి ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల క్రమశిక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైబ్రరీ బుక్స్ పంపిణీ



ములుగు: జిల్లాకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం బాలరక్ష భారత్ ఫ్యూర్ ప్లే, జిల్లా విద్యాశాఖ సమన్వయంతో లైబ్రరీ బుక్స్, డస్ట్‌బిన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వినోద్ మాట్లాడుతూ లైబ్రరీ బుక్స్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతాయని తెలిపారు. ఈ సందర్భంగా అందరూ చదవాలి, అందరూ ఎదగాలి అనే లక్ష్యంతో పనిచేస్తున్న బాలరక్ష భారత్ సంస్థ సేవలను అభినందించారు. అనంతరం సంస్థ ప్రతినిధి రవికుమార్ మాట్లాడుతూ జిల్లాలో 50 పాఠశాలలకు ఇప్పటి వరకు బుక్స్ అందజేసినట్లు వివరించారు.

ఇద్దరిపై కేసు నమోదు

వెంకటాపురం(కె): మండలకేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ తమదేనంటూ అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇద్దరిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వెంకటాపురం(కె) ఎస్సై కొప్పుల తిరుపతిరావు కథనం ప్రకారం ..మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ భవనాలు తమవేనంటూ అద్దెకు ఉంటున్న వారి నుంచి స్థానికులైన కిరణ్‌వర్మ, నిఖిల్‌లు రూ. 2.43లక్షలను అక్రమంగా వసూలు చేశారు. ఈ మేరకు భద్రాచలం ఆర్టీసీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిఖిల్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. కిరణ్‌వర్మ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

బాలికలు లక్ష్యంతో చదువుకోవాలి



భూపాలపల్లి రూరల్: బాలికలు లక్ష్యంతో చదువుకొని ముందుకు సాగాలని జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా సుభాష్ కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంక్షేమాధికారి చిన్నయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆడపిల్లలపై వివక్ష, హింస, బాల్యవివాహాలతో జరిగే నష్టాలను వివరించారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర గొప్పదన్నారు. మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తున్నారని చెప్పారు. ఆడపిల్లలకు చిన్న వయసులోనే వివాహాలు చేసి ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్న తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు ఏమైనా సమస్యలు వస్తే 1098 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ అనూష, అకౌంటెంట్ సురేష్, సూపర్‌వైజర్‌లు అరుణ, రజిత పాల్గొన్నారు.

ప్రవేశాల గడువు పొడిగింపు

భూపాలపల్లి అర్బన్: ఐటీఐలో నూతనంగా ప్రవేశ పెట్టిన కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 19వ తేదీ వరకు పొడిగించినట్లు స్థానిక ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ జుమ్లానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రీయల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఆర్టిసన్ యుసింగ్ అడ్వాన్స్ టూల్స్, బేసిక్ డిజైనర్ అండ్ వరుచ్యువల్ వెరిఫైర్ (మెకానికల్), అడ్వాన్స్ సీఎన్‌సీ మెషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్ కోర్సులకు 6వ విడత కౌన్సెలింగ్‌కు ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

దసరా ధమాకా!


ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఆదాయం రూ.28.99 కోట్లు

- తిరిగిన కిలో మీటర్లు 50 లక్షలు
- ఆక్యుపెన్సీ రేషియో 91 శాతం

హన్మకొండ: సద్దుల బతుకమ్మ, దసరా పండుగను ఆర్టీసీ సద్వినియోగం చేసుకుంది. రోజూ నడిచే బస్సులతోపాటు ప్రత్యేక సర్వీసులను నడపడం ద్వారా మరింత ఆదాయం సంపాదించుకుంది. ఈనెల 1 నుంచి 14వ తేదీ వరకు వరంగల్ రీజియన్‌లో టీజీఎస్ ఆర్టీసీ రూ.28.99 కోట్ల ఆదాయాన్ని రాబట్టుకుంది. 14 రోజులపాటు 50 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరిగాయి. 91 శాతం ఆక్యుపెన్సీ రేషియో ద్వారా కిలోమీటర్‌కు రూ.58 ఆదాయం పొందింది. బతుకమ్మ, దసరా పండుగకు విద్యాసంస్థలు సెలవులు ఇచ్చినప్పటి నుంచి ప్రయాణికుల రద్దీని బట్టి ప్రైవేట్ వాహనాలకు అవకాశం ఇవ్వకుండా సంస్థ వివిధ రూట్లకు సర్దుబాటు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంది.



డిపోల వారీగా ఆదాయం వివరాలు



	హనుమకొండ	జనగామ	వరంగల్-1	వరంగల్-2	మానుకోట	నర్సంపేట	పరకాల	తొర్రూరు	భూపాలపల్లి
ఆదాయం	373.22	338.69	467.24	393.18	203.02	284.87	223.94	329.99	285.47
కిలోమీటర్లు	6.72	6.16	7.82	7.16	3.46	4.92	3.79	5.22	4.75
ఈపీకే	55.50	54.97	59.76	54.95	58.61	57.89	59.15	63.27	60.07
ఓఆర్	81	94	83	86	103	96	98	104	97

- ఆదాయం (రూ.లక్షల్లో)
- తిరిగిన కిలోమీటర్లు (లక్షల్లో)
- ఎర్నింగ్స్ పర్ కిలోమీటర్ (ఈపీకే) రూ.లలో
- ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) శాతంలో

అత్యధిక ఆదాయం వరంగల్-1 డిపో

- పండుగ రోజుల్లో వరంగల్-1 డిపోకు అత్యధికంగా రూ.467.24 లక్షలు ఆదాయం వచ్చింది.
- అతి తక్కువగా మహబూబాబాద్ డిపో రూ.203.02 లక్షలు ఆదాయం సాధించింది.
- వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో ఆక్యుపెన్సీ రేషియోలో తొర్రూరు డిపో 104 శాతంతో అగ్రభాగాన నిలవగా.. మహబూబాబాద్ డిపో 103 శాతంతో ద్వితీయ స్థానంలో నిలిచింది.
- హనుమకొండ 81శాతం ఆక్యుపెన్సీ రేషియోతో చివరి స్థానంలో ఉంది.
- తొర్రూరు డిపో కిలోమీటర్‌కు రూ.63,27 ఆదాయం రాబట్టి కిలో మీటర్ లెక్కన వరంగల్ రీజియన్‌లో అగ్రభాగంలో నిలిచింది.
- భూపాలపల్లి డిపో కిలోమీటర్‌కు రూ.60.07 ఆదాయాన్ని పొంది రెండో స్థానంలో నిలిచింది.
- వరంగల్-1 డిపో 7.82 లక్షల కిలో మీటర్లు బస్సులు నడిపి మొదటి స్థానంలో నిలవగా.. 7.16 లక్షల కిలో మీటర్లు బస్సులు నడిపి వరంగల్-2 రెండో స్థానంలో నిలిచింది.

ఇందిరమ్మ ఇళ్లపైనే ఆశలు

ప్రజాపాలన దరఖాస్తుల్లో 92,400 మందికి ఇళ్ల కేటాయింపునకు మొగ్గు

- నియోజకవర్గానికి 3,700 ఇళ్లు మంజూరు
- గోదావరి ముంపు ప్రాంతాల వాసులకు మొదటి విడతలో కేటాయింపు
- వారితో పాటు మైదాన ప్రాంత నిరుపేదలకు కూడా ..

ములుగు: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు, నిర్మాణానికి పూర్తి స్థాయి విధి విధానాలు రూపొందించక ముందే నిరుపేదలు బోలెడంత ఆశతో ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి గత మూడేళ్లుగా జిల్లాలో నూతన ఇళ్ల కేటాయింపు జరగలేదు. మేనిఫెస్టోలో ఇందిరమ్మ ఇళ్ల అంశాన్ని చేర్చిన కాంగ్రెస్ పార్టీకి ములుగు నియోజకవర్గ ప్రజలు ఎన్నడూలేనంత మెజార్టీ ఇచ్చి బ్రహ్మరథం పట్టారు. దీనికి అనుగుణంగానే దసరా పండుగ రోజున ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే అనివార్య కారణాలతో నిలిచిపోయినా క్షేత్ర స్థాయిలో నిరుపేదలను గుర్తించేందుకు సర్వేను వేగవంతం చేసినట్లుగా తెలుస్తోంది.

నియోజకవర్గానికి 3,700 ఇళ్ల కేటాయింపు

ములుగు నియోజకవర్గంలోని తొమ్మిది మండలాలు(ములుగు జిల్లాలో ఏడు-మహబూబాబాద్ జిల్లాలో రెండు) ఉండగా మొదటి విడతలో 3,700 ఇళ్లు కేటాయించబడ్డాయి. స్థానిక ఎమ్మెల్యే ధనసరి సీతక్క మంత్రిగా, సీఎంకు సన్నిహితురాలిగా ఉండడంతో మరిన్ని ఇళ్లు మంజూరు చేయిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇంటింటా నిర్వహించిన ప్రజాపాలన సర్వేలో 99,364 దరఖాస్తుల్లో ఏకంగా 92,400 మంది తమకు ఇందిరమ్మ ఇళ్లు కావాలని ఆప్షన్ పెట్టుకున్నారు. ఈ లెక్కకు మంజూరైన లెక్కకు పొంతనలేకుండా పోతుంది.

ముంపు ప్రాంతాల వాసులకు మొదటి ప్రాధాన్యం

ప్రతీ ఏడాది వర్షాకాలంలో కురిసే భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరదలతో ముంపు ప్రాంతాల్లో వందలాది కుటుంబాలు ప్రమాదం అంచున గడుపుతున్నాయి. ప్రమాదం జరిగే అవకాశం ఉందని గోదావరి ఉధృతి పెరిగినా కొద్దీ అధికారులు హెచ్చరికలు జారీ చేసినప్పుడు మంగపేట, నర్సింహసాగర్, పొదుమూరు, రాంనగర్, ఏటూరునాగారం బీసీ కాలనీ వాసులను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. గతంలో ఇళ్లు కేటాయించాలని పలుమార్లు బాధిత కుటుంబాలు అర్జీలు పెట్టుకున్నా న్యాయం జరగలేదు. ఈ సారి మంజూరైన మొదటి విడత ఇళ్లలో సుమారు 25శాతం ఇళ్లు వారికే కేటాయింపు జరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. వారి తర్వాత ఇళ్లు కోల్పోయిన వారు, అత్యంత నిరుపేదలకు ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది.

ఈ ఫొటోలో కనిపిస్తున్నది మంగపేట మండలం నర్సింహసాగర్ గ్రామానికి చెందిన మెరుగు రవి. ఇతనికి సొంత ఇల్లు లేదు. ఇరిగేషన్ క్వార్టర్స్‌లో భార్య, ఇద్దరు పిల్లలు, తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. అది కూడా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఇంటిపై పరదా కప్పుకొని రోజులు గడుపుతున్నారు. గోదావరికి వరదలు వచ్చిన ప్రతీసారి వీరి కుటుంబాన్ని అధికారులు పునరావాస కేంద్రానికి తరలిస్తుంటారు. తగ్గుముఖం పట్టాక తిరిగి క్వార్టర్స్‌లో వదిలేస్తారు. ప్రతీ ఏడాది ఇదేతంతు. ఈ సారి ఇందిరమ్మ ఇల్లు కేటాయించి మైదాన ప్రాంతంలో కట్టిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.





ఈ ఫొటోలోని మహిళ పేరు ఇర్ప లక్ష్మీ. ఎస్ఎస్ తాడ్వాయి మండల కేంద్రంలోని ఎర్రగడ్డకు చెందిన ఆదివాసీ మహిళ. భార్యాభర్తలు కూలీ పనులకు వెళ్తే గానీ పూట గడువదు. పూరి గుడిసెలో నివాసం ఉంటూ ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఇద్దరు కూతుళ్లతో కాలం వెళ్లదీస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు పక్కింటి వాళ్ల ఇళ్లను ఆశ్రయిస్తుంటారు. ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మీ పథకానికి దరఖాస్తు చేసుకుంది. సొంత ఇంటి కళ ఈసారైనా నేరవేరుతుందా అని ఎదురుచూస్తున్నారు.

పూరి గుడిసెలో ఉంటున్నాం..



మాకు ఇద్దరు కుమారులు, కూతురు. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. ప్రస్తుతం తాము కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాము. ఉండడానికి సరైన ఇల్లు లేదు. చిన్న పూరి గుడిసెపై పరదా కప్పుకుని నివాసం ఉంటున్నాము. గత ప్రభుత్వం ఇళ్లు ఉన్న వారికే కేటాయించింది. పేదల గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా పేదలకు ఇళ్లు కేటాయించాలి.

- జాగటి అనసూయ- నర్సయ్య, చల్వాయి

బీసీ గురుకులాలకు తాళం!

అద్దె చెల్లించడం లేదని గేట్లకు తాళం వేసిన యజమానులు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 36 గురుకులాలు అద్దె భవనాల్లోనే
- ఏడు మాత్రమే సొంత భవనాల్లో
- మార్చినుంచి ఇప్పటి వరకు చెల్లించని అద్దె
- ప్రతీనెల చెల్లించాల్సింది రూ.74లక్షల నుంచి రూ.75లక్షల వరకు



మల్లంపల్లిలో కొనసాగుతున్న గురుకుల పాఠశాలకు తాళం వేసిన భవన యజమాని

సాక్షిప్రతినిధి, వరంగల్/విద్యారణ్యపురి: మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులాలకు తాళం పడింది. ఇప్పటికే అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుండగా మరోవైపు నెలల తరబడి అద్దె చెల్లించకపోవడం.. దసరా సెలవులు ముగియడం.. మంగళవారంనుంచి విద్యార్థులు రాక ప్రారంభంకావడంతో మొదటిరోజే అద్దెభవనాల యజమానులు పాఠశాల గేట్లకు తాళం వేసి నిరసన తెలిపారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులు గంటల తరబడి గేటు బయటే పడిగాపులు కాశారు. కొన్నిచోట్ల ప్రిన్సిపాళ్లు యజమానులకు నచ్చజెప్పినట్లు తెలుస్తోంది. సమస్య తీవ్రత ఎక్కువగా ఉండడంతో సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పరిష్కరించే దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం.

మూడో భాగం గురుకులాలు అద్దె భవనాల్లోనే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 43 వరకు మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులాలు ఉన్నాయి. ఇందులో ఏడు గురుకులాలకు ప్రభుత్వ భవనాలు ఉండగా, మిగతా 36 అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. వీటికి ప్రతీనెల రూ.74లక్షలనుంచి రూ.75 లక్షల వరకు ప్రభుత్వం అద్దె చెల్లించాల్సింటుంది. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు అద్దె చెల్లించడం లేదు. ఆయా యాజమాన్యాలు తమకు అద్దెబిల్లులు చెల్లించాలని పలుమార్లు కోరినప్పటికీ ప్రభుత్వం నుంచి విడుదల కాకపోవడంతో చివరికి దసరా సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచే రోజు (మంగళవారం) గురుకులాల గేట్లకు తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ విషయమై అద్దెభవనాల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షుడితో ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓ ఎం.రాజ్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడారు. అద్దె బకాయిలు చెల్లించేందుకు సంబంధిత ఉన్నతాధికారులు యత్నిస్తున్నారని, బిల్లులు వస్తాయని,సహకరించాలని తెలియజేసినట్లు రాజ్‌కుమార్ 'సాక్షి'కి తెలిపారు. ఉన్నతాధికారులు కూడా సంబంధిత అద్దె యాజమాన్యాలతో మాట్లాడినట్లు సమాచారం. ఆ తర్వాత కొంతవరకు సమస్య సద్దుమణిగి యజమానులు గేట్లకు తాళాలు తీసినట్లు తెలిసింది.

డిగ్రీ కళాశాలలు ఇలా..

బీసీ గురుకులాల్లో మహబూబాబాద్ జిల్లాలో రెండు డిగ్రీ కళాశాలలు, జనగామలో ఒకటి, భూపాలపల్లిలో ఒకటి అద్దె భవనాల్లో ఉన్నాయి. హనుమకొండ జిల్లా కాజీపేటలో మహిళలకు లా కాలేజీ, ములుగు జిల్లాకు మంజూరైన డిగ్రీ కాలేజీ కూడా లా కాలేజీ సొంత భవనంలోనే నడుపుతున్నారు.

జిల్లాల వారీగా బీసీ గురుకులాలు ఇలా..

జిల్లా	మొత్తం	సొంత భవనాలు	అద్దె భవనాలు
జేఎస్‌భూపాలపల్లి	05	02	03
హనుమకొండ	12	04	08
వరంగల్	07	00	07
జనగామ	07	01	06
ములుగు	03	01	02
మహబూబాబాద్	06	00	06

ములుగు జిల్లాలో మంజూరైన 3 గురుకులాలను అక్కడ ఏర్పాటు చేయకుండా ఒకటి హనుమకొండ జిల్లా శాయంపేటలో, వరంగల్ జిల్లాలో ఆరెపల్లిలో మరోటి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలో ఒకటి ఏర్పాటు చేశారు.

గేటు బయటే విద్యార్థులు, ఉపాధ్యాయులు - వివరాలు 10లో▸

- అద్దె చెల్లించలేదని గురుకులాల గేట్లకు తాళం
- భవన యజమానుల నిరసన

కేంద్రప్రభుత్వ పథకాల పనితీరుపై పరిశీలన



నర్సింహాసాగర్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎన్ఎల్‌ఎం టీం సభ్యులు

మంగపేట: మండల పరిధిలోని నర్సింహాసాగర్, చెరుపల్లి గ్రామాల్లో నేషనల్ లెవల్ మానిటరింగ్ టీం(ఎన్ఎల్ఎం) బృందం సభ్యులు మంగళవారం పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాల పనితీరుపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా పొదుపు సంఘాల నిర్వహణ, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, పింఛన్లు తదితర అంశాలపై ఉపాధిహామీ కూలీలు, పొదుపు సంఘాల మహిళలు, పింఛన్ దారులను ఆయా పథకాల నిర్వహణ ఎలా ఉందనే అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎల్ఎం టీం జిల్లా అధికారి వెంకటనారాయణ, సెర్ప్ ఏపీడీ వేణు, ఎంపీడీఓ భద్రు, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, ఏపీఎం అప్పారావు, పంచాయతీ కార్యదర్శి రూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి జీవన భృతికింద రూ.10వేలు చెల్లించాలి

- కుమారుడిని ఆదేశించిన ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి

మంగపేట: తల్లి లక్ష్మీనర్సమ్మ జీవన భృతికి ప్రతినెలా రూ.10వేలు చెల్లించాలని ములుగు జిల్లా మంగపేట మండల పరిధిలోని కోమటిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్ఎం మేరగోజు బ్రహ్మచారికి ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. కుమారుడు బ్రహ్మచారి తనను పట్టించుకోవడంలేదని, కంటి సమస్యతో బాధపడుతున్నానని, హెల్త్‌కార్డు కూడా ఇవ్వడం లేదని, వైద్యఖర్చులతోపాటు తన పోషణ ఖర్చులు ఇప్పించాలని సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కడవేర్గు గ్రామానికి చెందిన మేరగోజు లక్ష్మీనర్సమ్మ మంగళవారం ములుగు ఆర్డీఓను ఆశ్రయించింది. ఈ మేరకు స్పందించిన ఆర్డీఓ.. తల్లిదండ్రులు, సీనియర్ పౌరుల సంక్షేమ చట్టం 2007 నిబంధనల ప్రకారం స్వగ్రామమైన కడవేర్గులో ఉంటున్న తల్లికి ఎస్‌బీఐ బ్యాంక్ అకౌంట్ ద్వారా ప్రతినెలా రూ.10వేల నగదు చెల్లించాలని, అనారోగ్య సమస్య వచ్చినప్పుడు చూసుకోవాలని కుమారుడు బ్రహ్మచారిని ఆదేశించారు. తక్షణమే ఉత్తర్వులు అమలయ్యేలా చూడాలని, ఫిర్యాదుదారులకి సహకరించాలని మంగపేట తహసీల్దార్, స్థానిక ఎస్సైలకు సూచించారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కిషన్

గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా గ్రామ పంచాయతీ కార్యాలయంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై వైజీఆర్ కేర్ సంస్థ లింక్ వర్కర్ టి.కిషన్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని తెలిపారు. ప్రతిఒక్కరూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ ప్రాణాంతక వ్యాధిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా హెచ్ఐవీ పరీక్షలు ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ సెంటర్‌లో ఉచితంగా చేస్తారని వివరించారు. ఎవరికైనా పాజిటివ్ అని తేలితే వారి పేరు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. హెచ్ఐవీ బాధితుల జీవితకాలం పెంపొందించేందుకు ఏఆర్‌టీ మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

కొత్త టీచర్లకు పోస్టింగ్



పోస్టింగ్ పత్రాలతో నూతన ఉపాధ్యాయులు

ములుగు: డీఎస్సీలో అర్హత సాధించిన నూతన ఉపాధ్యాయులకు మంగళవారం జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి మెరిట్ ఆధారంగా పోస్టింగ్ ఇచ్చారు. జిల్లాలో మొత్తం 192 ఖాళీలకు గాను 178మంది అర్హత సాధించారు. ఇందులో ఒకరికి జేఎల్ పోస్టు రావడం, మరొకరు రెండు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు అర్హత సాధించడంతో 176 మందికి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు. వీరిలో మంగళవారం కౌన్సెలింగ్‌కు 176మంది హాజరై పోస్టింగ్ పత్రాలు అందుకున్నారు.

సీసీ కెమెరాల పాత్ర కీలకం

డీఎస్పీ సంపత్‌రావు




సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ సంపత్‌రావు

చిట్యాల: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమైందని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. ప్రజల సహకారంతో మంగళవారం చల్లగరిగ గ్రామంలో ఏర్పాటుచేసిన 20 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ప్రధానపాత్ర పోషిస్తాయని చెప్పారు. నేరస్తుల గుర్తింపు, అమాయకుల నిర్దోషిత్వాన్ని నిరూపించుట, ఆకతాయిల చర్యల కట్టడికి ఉపయోగపడుతాయని చెప్పారు. చల్లగరిగ గ్రామంలో రూ.2 లక్షల నిధులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం పట్ల గ్రామస్తులను అభినందించారు. మండలంలోని మిగతా గ్రామాలలో కూడా సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లేష్, ఎస్సై శ్రావణ్‌కుమార్, ట్రైనీ ఎస్సైలు మహేష్, రాజ శేఖర్, పోలీస్ సిబ్బంది నవీన్, నాగరాజు, గ్రామస్తులు అశోక్‌రెడ్డి, రాజిరెడ్డి, రాజు, నాగరాజు, సుధాకర్, కైలాసం, రాజేందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

20న ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో ఎంపికలు



వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 20వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూనియర్ బాలబాలికల ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట శ్యాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారుల ఎత్తు, బరువు, వయసు కలుపుకుని 250 పాయింట్లు దాటొద్దని, నవంబర్ 11, 2006 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఉదయం 10 గంటలకు జేఎన్ఎస్‌లోని ఖోఖో స్టేడియం వద్ద ఆధార్, పుట్టిన తేదీ సర్టిఫికెట్లతో ఖోఖో కోచ్ రాజారపు రమేశ్‌ను సంప్రదించాలని సూచించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో కూడిన జిల్లా జట్టు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయిలో పాల్గొంటుందని తెలిపారు.

పండుగకు వచ్చి ప్రాణం తీసుకున్నాడు..

- క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య
- మహబూబాబాద్‌లో ఘటన



సురేశ్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : దసరా పండుగకు ఇంటికి వచ్చిన ఓ యువకుడు క్షణికావేశంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని నందమూరి నగర్ కాలనీకి చెందిన మంజల సురేశ్ (30), భార్య కల్యాణి, కుమారుడు, కుమార్తెతో కలిసి బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్ వెళ్లాడు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో దసరా సందర్భంగా ఇంటికి వచ్చాడు. పండుగ అనంతరం హైదరాబాద్ వెళ్దామని భార్య కల్యాణి చెప్పగా మద్యం మత్తులో ఉన్న సురేశ్ తరువాత వెళ్దామని చెప్పాడు. తల్లి సత్తెమ్మ, భార్య కల్యాణి.. మద్యం ఎందుకు సేవిస్తున్నావని మందలించగా, మీరు వెళ్లండి నేను తరువాత వస్తానని చెప్పాడు. దీంతో కల్యాణి తన కుమారుడు, కుమార్తెతో కలిసి హైదరాబాద్ వెళ్లడానికి రైల్వే స్టేషన్ చేరుకుంది. బయట ఉన్న తల్లి సత్తెమ్మ ఇంట్లోకి వచ్చి చూడగా సురేశ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి సత్తెమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్సై జోవెల్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి శవ పంచనామా జరిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

గేటు బయటే విద్యార్థులు, ఉపాధ్యాయులు

అద్దె చెల్లించలేదని గురుకులాల గేట్లకు తాళం | భవనాల యజమానుల నిరసన



చెన్నారావుపేట : భవనానికి తాళం వేస్తున్న యజమాని కంది గోపాల్‌రెడ్డి



గూడూరు: మహాత్మా జ్యోతిరావుపూలే గురుకులానికి తాళం వేస్తున్న భవన యజమాని నితిన్

తొర్రూరు/ఖానాపురం/చెన్నారావుపేట/దుగ్గొండి/గూడూరు/రేగొండ/ఖిలావరంగల్/భూపాలపల్లి అర్బన్/ములుగు రూరల్: : గురుకులాల భవనాలకు రాష్ట్ర ప్రభుత్వం అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ బాలుర గురుకులం, మైనార్టీ బాలికల గురుకులం, నాంచారి మడూరులోని బీసీ బాలుర డిగ్రీ గురుకుల కళాశాల గేట్లకు యజమానులు తాళాలు వేసి నిరసన తెలిపారు. దీంతో విధులకు హాజరయ్యేందుకు వచ్చిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు అరుబయటే నిరీక్షించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ 8 నెలలుగా ప్రభుత్వం అద్దె చెల్లించలేదని, పాఠశాల భవనాలకు నెలకు రూ.3 లక్షలు, కళాశాల భవనాలకు రూ. 4.50 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉందన్నారు. అనంతరం అధికారుల హామీ మేరకు భవనాల యజమానులు గురుకులాల గేట్లు తెరిచారు.

- గూడూరు మండలంలోని మర్రిమిట్ట శివారు మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల విద్యాలయానికి మంగళవారం భవన సముదాయ యజమాని నితిన్ తాళం వేశారు. సమాచారం అందుకున్న గురుకుల విద్యాలయాల సెక్రటరీ.. వచ్చే నెల 4వ తేదీ లోపు అద్దె డబ్బులు చెల్లిస్తామని ఫోన్‌లో హామీ ఇచ్చారు.
- వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని ఐనపల్లిలోని జ్యోతిరావుపూలే పాఠశాలకు యజమాని మంగళవారం తాళం వేశారు. దీంతో మధ్యాహ్నం వరకు ఉపాధ్యాయులు లోపలికి వెళ్లకుండా ఆగిపోయారు.
- దుగ్గొండి మండలం గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల గేటుకు యజమానులు బైరెడ్డి రాజేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి తాళం వేశారు.
- దుగ్గొండి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల.. చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల హైస్కూల్ భవనంలో కొన్నేళ్లుగా నడుస్తోంది. అంతేకాకుండా ఇందులోనే హాస్టల్ కూడా నడుస్తోంది. అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో భవనానికి తాళం వేసినట్లు యజమాని గోపాల్‌రెడ్డి తెలిపారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని లింగాల మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బాలికల హాస్టల్ భవనానికి 8 నెలలుగా అద్దె చెల్లించక పోవడంతో యజమానికి గేటుకు తాళం వేశారు.
- అద్దె బకాయిలు చెల్లిచాలని డిమాండ్ చేస్తూ వరంగల్ ఉర్సు గుట్ట వద్ద మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాల భవనానికి తాళం వేశారు. దీంతో కళాశాల సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు బయటే నిరీక్షించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీలోని మైనారిటీ గురుకుల పాఠశాల గేట్‌కు భవన యాజమాని నాగుల దేవేందర్‌రెడ్డి తాళం వేశారు. ఉదయం 8గంటలకే తాళం వేయడంతో అధ్యాపకులు సాయంత్ర వరకు గురుకుల పాఠశాల ఎదుటే చెట్ల కింద వేచి ఉన్నారు. విద్యార్థులు తిరిగి ఇంటికి వెళ్లారు.
- ములుగు మండలం మల్లంపల్లిలో అద్దెకు కొనసాగుతున్న ఏటూరునాగారానికి చెందిన గురుకుల పాఠశాలకు యజమాని తాళం వేశారు. సాయంత్రం వరకు సమస్య పరిష్కారం కాకపోవడంతో విద్యార్థులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారని పాఠశాల ప్రిన్సిపాల్ అంకయ్య తెలిపారు.

రామప్ప ఖ్యాతి ప్రపంచానికి చాటాలి

- కలెక్టర్ దివాకర టీఎస్
- ఆలయంలో వరల్డ్ హెరిటేజ్ క్యాంపెయిన్ ప్రారంభం



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర టీఎస్

వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని కలెక్టర్ దివాకర టీఎస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని రామప్ప దేవాలయ గార్డెన్‌లో వరల్డ్ హెరిటేజ్ క్యాంపెయినింగ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారసత్వ సంపదను భావితరాలకు అందించడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పనిచేయాలని పేర్కొన్నారు. 'వర్కింగ్ ఆన్ ది ఫ్యూచర్' అనే అంశంపై వరల్డ్ హెరిటేజ్ వలంటీర్స్–2024 క్యాంపెయిన్‌ను అక్టోబర్ 15 నుంచి 26 వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 40 మంది వలంటీర్లతో పాటు ఉమ్మడి వరంగల్‌కు చెందిన మరో 40 మంది వలంటీర్లుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, పర్యాటకం, కాకతీయుల ఇంజనీరింగ్ ప్రతిభ, ఇతర అంశాలపై బోధన తరగతులతో పాటు ఫీల్డ్ ట్రిప్స్ ఉంటాయని, ఈ క్యాంపెయిన్ వలంటీర్లకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పాండురంగారావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యుడు శ్రీధర్‌రావు, జిల్లా టూరిజం అధికారి శివాజీ, అసిస్టెంట్ ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్, యోగా ఇన్‌స్ట్రక్టర్ రాంబాబు, గైడ్‌లు విజయ్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ డ్రగ్స్ టీమ్, పోలీసుల తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేషన్‌లో మంగళవారం యాంటీ డ్రగ్ టీమ్, కాజీపేట పోలీసులు సంయుక్తంగా నార్కొటిక్ డాగ్ సహాయంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంలు, ప్రయాణికులు వేచి ఉండే గదులు, అనుమానాస్పద ప్రయాణికులు, వారి బ్యాగులను తనిఖీ చేశారు. ఈతనిఖీలో కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్, నవీన్, యాంటీ డ్రగ్స్ టీమ్ ఇన్‌స్పెక్టర్ జె.సురేశ్, ఆర్ఎస్సైలు పూర్ణచంద్రారెడ్డి, మనోజ్‌రెడ్డి, నాగరాజు, ఆర్ఐ శివకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూడుశాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్

హన్మకొండ చౌరస్తా: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లింలకు 3 శాతం రిజర్వేషన్ అమలు చేయడం వల్ల అనేక మంది ఉద్యోగాలు పొందారని, ప్రస్తుత ప్రభుత్వం ఆ రిజర్వేషన్ అమలు చేయాలని ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ అన్నారు. హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం, ముస్లిం వెల్ఫేర్ సొసైటీ, ఆల్ ఫాయిజన్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశంలో దళితుల కంటే ముస్లింలు సామాజికంగా, విద్యా రంగంలో వెనకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం సంక్షేమం కోసం కేవలం రూ.2వేల కోట్లు కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో రూ.5వేల కోట్లు చేర్చిందని, త్వరలోనే ఆ నిధులు మంజూరయ్యేలా సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానన్నారు. ప్రతీ పేద ముస్లింకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కేంద్రంలో కుర్చీ కోసం బీజేపీ సర్కార్ మత విద్వేషాలను రెచ్చగొడుతోందని విమర్శించారు. డాక్టర్ అనీసిద్దిఖీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా, డాక్టర్ జమాలషరీఫ్, డాక్టర్ రజామాలిక్, ప్రొఫెసర్ ముస్తఫా, డాక్టర్ రాజ్‌మహ్మద్, సిరాజ్ అహ్మద్, నయీముద్దీన్, నస్రీన్ వాహిది, ఇస్మాయిల్ షంషీ, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి వరంగల్ జిల్లా గాయకుల ఎంపిక



మాట్లాడుతున్న వరంగల్ శ్రీనివాస్

నయీంనగర్: 'నూరేండ్ల నా ఊరు' గేయం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి గాయకులను ఎంపిక చేసి చారిత్రక పాటలో అవకాశం కల్పించనున్నట్లు కవి, గాయకుడు వరంగల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. వంద సంవత్సరాల పల్లె చరిత్ర, మానవ జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, మానవీయ విలువలు చాటి చెప్పేలా అప్పటి యాస, భాషతో కూడిన సాహిత్యాన్ని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో 243 చరణాలు కలిగిన గేయం రచించి దానిని 243 మంది గాయకులతో పాడిస్తామన్నారు. ఇందుకోసం రెండు తెలుగు రాష్ట్రాల ఉంచి గాయకులను ఎంపికచేస్తామన్నారు. మొదట ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ప్రారంభిస్తామన్నారు. రేపు (బుధవారం) కేయూ బైపాస్‌లోని శారదా ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గాయకుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. సమావేశంలో కళాకారులు గిద్దె రాంనర్సయ్య, జూపాక శివ, వెంకన్న, సునీల్, సంజీవ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య ప్రవేశాల గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్ : కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్, ఓరియంటేషన్ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు దూరవిద్య కేంద్రం (ఎస్‌డీఎల్‌సీఈ) డైరెక్టర్ వల్లూరి రామచంద్రం మంగళవారం తెలిపారు. ఈనెల 15వతేదీతో గడువు ముగియడంతో పెంపుదల చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చుని వివరించారు. మొత్తం 33 కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నామన్నారు. డిగ్రీలో బీఏ, బీకాం, జనరల్ కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ, బీఎల్, బీఎస్సీ, ఎం.ఏ తెలుగు, ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, హిస్టరీ, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, హెచ్ఆర్ఎం, ఎం.కామ్, సోషల్ వర్క్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎమ్మెస్సీ సైకాలజీ, గణితశాస్త్రం, ఎన్విరాన్మెంటల్ సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, వృక్ష, జంతు శాస్త్రాలు, ఎంఎల్ఐఎస్సీ ఉన్నాయని తెలిపారు. అలాగే, డిప్లొమా కోర్సుల్లో కంప్యూటర్ అప్లికేషన్స్, గైడ్స్ అండ్ కౌన్సెలింగ్, యోగా, సర్టిఫికెట్ కోర్సుల్లో సీఎల్ఐఎస్సీ, మిమిక్రీలో ఓరియంటేషన్ కోర్సుల్లోనూ ప్రవేశాలు పొందొచ్చన్నారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఫొటో జత చేసి కోర్సు రుసుం ఆన్‌లైన్‌లో కాని దూర విద్య కేంద్రం ఎస్‌బీఐ ఎక్స్‌టెన్షన్ కౌంటర్ నుంచి చలాన్ ద్వారా కాని చెల్లించొచ్చన్నారు. కోర్సులు, ఫీజులు వివరాలకు 0870–24611480,2461490 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆప్త మిత్రుడిని కోల్పోయాం..

- నరేశ్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు
- మాజీ మంత్రి హరీశ్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ నేతల నివాళి





నరేశ్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, రాజ్యసభ సభ్యుడు వద్ది రాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, తదితరులు

మరిపెడ రూరల్: ఆప్త మిత్రుడు నూకల నరేశ్ రెడ్డిని కోల్పోయామని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం విధితమే. కాగా, ఆయన వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన దశ దిన కర్మలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై నరేశ్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేశ్ రెడ్డి కుమారులు అనిరుధ్‌రెడ్డి, అభినవ్‌రెడ్డిని మంత్రులు పరామర్శించారు. అనంతరం మంత్రులు పొంగులేటి, తుమ్మల మాట్లాడుతూ ఫ్యామిలీ రిలేషన్ కంటే కూడా వ్యక్తిగతంగా నరేశ్‌రెడ్డి తమకు ఆప్త మిత్రుడన్నారు. నరేశ్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, భూక్య మురళీనాయక్, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డి, జిల్లా నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, పెండ్లి రఘువీర్ రెడ్డి, ఘనపురపు అంజయ్య, వేణుగోపాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, గౌడుగు శ్రీనివాస్, కాలం శ్రీనివాస్‌రెడ్డి, పానుగోతు రాంలాల్, గంధసిరి అంబరీష, మెంచ్ అశోక్, పటేల్ దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ఘననివాళి..

నరేశ్‌రెడ్డి దశ దిన కర్మలకు బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నరేశ్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి వెంట రాజ్య సభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, మాజీ ఎమ్మెల్యేలు డీఎస్ రెడ్యానాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, మాజీ ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఓడీ ఎస్ఎంఎస్ చైర్మన్ కుడితి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

సీపీఎం ఆధ్వర్యంలో నూకల నరేశ్‌రెడ్డి చిత్ర పటానికి నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సోమయ్య, గునిగంటి రాజన్న, అల్వాల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ధరణి కన్నుమూత

- చికిత్స పొందుతూ మృతి



ధరణి(ఫైల్)

నల్లబెల్లి/హసన్‌పర్తి: నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్ జోరుక ధరణి(24) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై ప్రశాంత్ బాబు కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తికి చెందిన జోరుక రాజేశ్వరి, కుమారస్వామి దంపతుల కూతురు ధరణి నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ పోలీస్ క్వార్టర్స్‌లో ఉంటోంది. తన ద్విచక్ర వాహనం కోసం తీసుకొచ్చిన పెట్రోల్‌ను గదిలో ఉంచింది. ఈ నెల 13న పెట్రోల్ బాటిల్ లీకేజీ కావడంతో గదిలో మంటలు వ్యాపించి ధరణికి అంటుకోగా బయటకు వచ్చింది. ఈ విషయం సహ మహిళా కానిస్టేబుల్ స్వర్ణకు చెప్పింది. అప్రమత్తమైన స్వర్ణ పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తూ కాలిన గాయాలతో ఉన్న ధరణిని పెట్రో కార్‌లో ఎంజీఎంకు తరలించింది. వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ధరణి మృతితో స్వగ్రామం పెంబర్తిలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలి సోదరుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, 2020 బ్యాచ్‌కు చెందిన ధరణి.. పరకాల పోలీస్ స్టేషన్‌లో మొదటి పోస్టింగ్ పొందారు. అనంతరం 2022 సెప్టెంబర్‌లో బదిలీపై నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు.

వరంగల్ మార్కెట్‌లో అంతర్గత బదిలీలు

- ఖరీఫ్‌లో విధుల నిర్వహణ కోసమే మార్పులు
- ఖాళీ పోస్టులతో ఉన్న వారిపై అదనపు భారం



వరంగల్ వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయం

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ప్రధాన కార్యాలయం, లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్, పండ్ల మార్కెట్‌లో విధులు నిర్వర్తించే సూపర్‌వైజర్లు, ఏఎంఎస్, జేఎంఎస్‌లను పెద్ద ఎత్తున అంతర్గత బదిలీలు చేస్తూ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జి.శ్రీకాంత్(సూపర్‌వైజర్)కు అసెస్‌మెంట్ సెక్షన్ (ఎ టు ఎం), పర్చేజ్ రిటర్న్, మార్కెట్ ఫీజుల వసూళ్లు, జేడీఎం, డీడీఎం, డీఎంఓలకు నివేదికలు పంపించే బాధ్యతలు అప్పగించారు. వినయ్‌కాంత్ యూడీసీకి అసెస్‌మెంట్ సెక్షన్(ఎన్ టు జెడ్), పర్చేజ్ రిటర్న్, మార్కెట్ ఫీజుల వసూళ్లు, జేడీఎం, డీడీఎం, డీఎంఓలకు నివేదికలు పంపించే బాధ్యతలు అప్పగించారు. గంగాధర్(సూపర్‌వైజర్)కు కోల్డ్ స్టోరేజీలు, గోదాంల నిర్వహణ, వాచ్ అండ్ వార్డు ఇన్‌చార్జ్ విధులు అప్పగించారు. వి.స్వప్న (సూపర్‌వైజర్)కు కార్యాలయంలోని ఎస్టాబ్లిష్‌మెంట్–1 సెక్షన్‌తో పాటు ధాన్యం, అపరాల యార్డు పూర్తి ఇన్‌చార్జ్ బాధ్యతలతో పాటు ఈ–నామ్ నిర్వహణ, రైతులకు లాట్ ఐడీల జారీ తదితర బాధ్యతలు అప్పగించారు. డి.లక్ష్మీనారాయణ(యూడీసీ)కు ధాన్యం, అపరాల యార్డు నిర్వహణ అప్పగించారు. మురళీయాదవ్(సూపర్‌వైజర్)ను లక్ష్మీపురం మోడల్ వెజ్ మార్కెట్ పూర్తి ఇన్‌చార్జ్‌గా నియమించారు. సలీం(సూపర్‌వైజర్)ను పత్తి యార్డులో పూర్తి ఇన్‌చార్జ్‌గా నియమించారు. చక్రబహదూర్ (సూపర్‌వైజర్)కు గ్రేయిన్ మార్కెట్‌లోని యార్డుల్లో దడవాయిలకు విధుల కేటాయింపు, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, లైటింగ్ పర్యవేక్షణ అప్పగించారు. సాగర్(సూపర్‌వైజర్)కు అదనంగా మిర్చి యార్డు విధులు కేటాయించారు. డి.నర్సింహ(సూపర్‌వైజర్)కు పత్తి యార్డులో పూర్తి విధులు అప్పగించారు. జ్యోతి ప్రకాశ్ (సూపర్‌వైజర్)మార్కెట్ ప్రధాన కార్యాలయానికి వచ్చే లెటర్లు, దరఖాస్తులు ఇన్‌వార్డులో నమోదు చేసి కార్యదర్శికి, కార్యాలయం నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు పంపే లెటర్లు ఔట్ వార్డ్ నిర్వహిస్తారు. నర్సింగరావు(సూపర్‌వైజర్)కు ప్రధాన కార్యాలయంలో డిమాండ్ సెక్షన్, తక్‌పట్టీ సెక్షన్, బజారు సెక్షన్ల పూర్తి బాధ్యతలు అప్పగించారు. శ్రీనునాయక్(సూపర్‌వైజర్)కు లక్ష్మీపురం పండ్ల మార్కెట్‌లో పూర్తి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. జి.వివేక్(జేఎంఎస్) పత్తి యార్డు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఎం.రజిత(జేఎంఎస్) ప్రధాన కార్యాలయంలోని డిమాండ్, తక్‌పట్టీ సెక్షన్‌తో పాటు మిర్చి యార్డులో సహాయకులిగా అదనపు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

సీజన్‌లో ఇబ్బందులు లేకుండా..



రానున్న ఖరీఫ్ సీజన్‌లో వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతులకు సరుకుల కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యార్డుల్లో విధులు నిర్వర్తించేందుకు ఉద్యోగులకు అంతర్గత బదిలీలు నిర్వహించాం. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగానే అక్కడ విధులు నిర్వర్తించేందుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తాం.

–పి.నిర్మల, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి

ఉద్యోగులపై అదనపు భారం...

వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో అన్ని క్యాడర్లు గ్రేడ్–1, గ్రేడ్–2, యూడీసీ, అకౌంటెంట్, ఎల్‌డీసీ, గ్రేడర్, ఏఎస్‌లు, సూపర్‌వైజర్లు, ఏఎంఎస్, జేఎంఎస్‌లతో కలిపి 109 మంజూరు పోస్టులు ఉన్నాయి. ఇందులో 83 పోస్టులు ఖాళీ ఉండగా కేవలం 26 పోస్టుల్లో మాత్రమే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఖాళీలతో ప్రస్తుతం ఉన్న వారికి అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల యార్డుల్లో పర్యవేక్షణ కొరవడే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేస్తే మార్కెట్‌లో పర్యవేక్షణ పెరిగి రైతుల సరుకులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుందని రైతు సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి

- మృతదేహాన్ని వెలికి తీసి కుటుంబీకులకు అప్పగించిన పోలీసులు



చిరంజీవి (ఫైల్)

రామన్నపేట : ఓ వ్యక్తి కాల్వలో పడి మృతి చెందాడు. ఈ ఘటన వరంగల్ డాక్టర్స్ కాలనీలో చోటు చేసుకుంది. మట్టెవాడ పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ డాక్టర్స్ కాలనీలో నివాసముంటూ ప్రైవేట్ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్న గజ చిరంజీవి(39) సోమవారం రాత్రి 9 గంటల సమయంలో తన బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో తన ఇంటికి సమీపంలోని క్యాలలో కాలుకు అంటుకున్న బురద కడుక్కునేందుకు అందులోకి దిగాడు. ఈ సమయంలో కాలు జారడంతో కొట్టుకుపోయాడు. సురేశ్ అనే వ్యక్తి దీనిని గమనించి చిరంజీవి కుటుంబ సభ్యులకు తెలిపాడు. కాగా, చిరంజీవి మృతదేహం గీసుగొండ మండలం బాలయ్యపల్లి బ్రిడ్జి వద్ద చిక్కుకోగా పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి మంగళవారం కుటుంబీకులకు అప్పగించారు. ఈ ఘటనపై మృతుడి భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు.

కళాక్షేత్రానికి ఉర్దూభాష నేమ్‌ప్లేట్ బిగింపు

సాక్షి స్పందన



న్యూశాయంపేట : హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రానికి రాష్ట్ర రెండో అధికార భాష ఉర్దూ నేమ్‌ప్లేట్‌ను బిగించారు. కాగా, కాళోజీ కళాక్షేత్రం పేరు ఉర్దూలో కూడా లిఖించాలని ఆ భాషాభిమానులు, కళాకారులు, కవులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) అధికారులు స్పందించారు. మంగళవారం కళాక్షేత్రం ఎదుట ఉన్న గ్రిల్స్‌కు తాత్కాలికంగా ఉర్దూ భాషలో లిఖించిన నేమ్‌ప్లేట్ బిగించారు. కాగా, పర్మనెంట్‌గా బిల్డింగ్ పై భాగంలో రేడియం అక్షరాలతో ఉర్దూ నేమ్‌ప్లేట్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు మహ్మద్ నయీం డిమాండ్ చేశారు.

వ్యక్తి పై కేసు నమోదు

ఖిలా వరంగల్ : చెల్లెపై దాడికి పాల్పడిన అన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. శంభునిపేట విశ్వనాథ కాలనీలో పాలేపాక అరుణ నివాసం ఉండగా.. ఆమె అన్న మస్తాన్ వరంగల్ లక్ష్మీపురంలో నివాసం ఉంటున్నాడు. తన భార్యను తీసుకురావాలని మస్తాన్ తన చెల్లి అరుణ కోరాడు. దీనికి ఆమె నిరాకరించడంతో ఈనెల 12న దాడికి పాల్పడ్డాడు. అరుణ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

క్లుప్తంగా

పరామర్శ



ములుగు రూరల్: మండలంలోని మాన్‌సింగ్ తండా గ్రామానికి చెందిన మాలోత్ రాజేశ్వరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ యూత్ జిల్లా అధ్యక్షుడు రవిచందర్ మంగళవారం పరామర్శించి చేయూతనందించారు. కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు ఎండి చాంద్‌పాషా, నల్లెల్ల భరత్‌కుమార్, రామ కృష్ణారెడ్డి, జోషి, ప్రతాప్, సురేష్, హుస్సేన్, రాహుల్‌సింగ్, యాకూబ్, తదితరులు ఉన్నారు.

మద్యానికి బానిసై విద్యార్థి ఆత్మహత్య



రాజేందర్(ఫైల్)

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని మానసపల్లికి చెందిన జగజంపుల రాజేందర్ (23) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తాజొద్దీన్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన జంగజంపుల లక్ష్మయ్య కుమారుడు రాజేందర్ డిగ్రీ చదువుకుంటూ అన్న అనురాగ్ వద్ద స్కూటర్ మెకానిక్ పని నేర్చుకుంటున్నారు. ఈ క్రమంలో మద్యానికి బానిసై రాజేందర్ ఈనెల 12న ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. ఈ క్రమంలో అపస్మారక స్థితిలో ఉండడంతో వరంగల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. రెండు రోజులుగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరు..



సమ్మయ్య(ఫైల్)

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన రాచకొండ మల్లయ్య (44) జీవితం మీద విరక్తి చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తాజొద్దీన్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన మల్లయ్య పదేళ్ల క్రితం హైదరాబాద్‌లో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ పని నచ్చక రామన్నగూడెం వచ్చి తన కుమార్తె ఉషా వద్ద ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. 15 రోజుల నుంచి మద్యం మత్తులో ఉంటూ ఈనెల 14 ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఏటూరునాగారంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా, చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. కుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జ్వరంతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

ములుగు రూరల్: జ్వరంతో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని జంగాలపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. తోటి ఉద్యోగులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగాలపల్లి గ్రామానికి చెందిన నీరటి సమ్మయ్య(55) వరంగల్–2 డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత వారం హనుమకొండ నుంచి విశాఖపట్నం డ్యూటీలో భాగంగా వెళ్లాడు. ఈ క్రమంలో సమ్మయ్యకు జ్వరం రావడంతో అనారోగ్యంతో హనుమకొండకు చేరుకున్నాడు. ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పొందుతుండగా మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడని తెలిపారు. మృతుడు సమ్మయ్యకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కొనసాగుతున్న ఎల్‌ఆర్‌ఎస్ సర్వే



కాటారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎల్ఎఆర్ఎస్ సర్వే మండలంలో కొనసాగుతుంది. ఇందులో భాగంగా మంగళవారం ఎల్‌ఆర్‌ఎస్ సర్వే బృందం కాటారం గ్రామపంచాయతీ పరిధిలో సర్వే చేపట్టారు. ఎంపీఓ వీరస్వామి ఆధ్వర్యంలో సర్వే బృందం సభ్యులు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ఆధారంగా సర్వే చేశారు. దరఖాస్తుదారుల భూమి పరిశీలించి హద్దుల వివరాలు అడిగి తెలుసుకున్నా రు. కొలతలు తీసుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సర్వేలో టీం లీడర్ కాటారం పంచాయ తీ కార్యదర్శి షగీర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు నవ్యశ్రీ, శ్రీనివాస్, నాగరాజు, రాజశేఖర్, వంశీకృష్ణ, గంగాధరన్, ప్రవీణ్, కుమారస్వామి, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిన నిర్మాణాలు



మధ్యలో నిలిచిపోయిన తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయ నిర్మాణం



శిథిలావస్థకు చేరిన భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

- మధ్యలోనే ఆగిన తహసీల్దార్, ఆర్డీఓ భవన నిర్మాణ పనులు
- శిథిలావస్థకు చేరిన భవనంలో కొనసాగుతున్న కార్యాలయాలు

ఏటూరునాగారం: ఏజెన్సీకి కేంద్ర బిందువు అయినా ఏటూరునాగారం తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థలో ఉంది. గతంలో ఐటీడీఏ పక్కనే ఉన్న పురాతనమైన భవనం శిథిలావస్థకు చేరడంతో దానిని కూల్చివేసి ఐటీడీఏ గిరిజన సంక్షేమశాఖ ద్వారా డీఎంఎఫ్‌టీ కింద 2022–23లో రూ.60లక్షలు మంజూరు ఇచ్చి టెండర్లు పిలిచారు. టెండర్లను దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టారు. కాగా, గత ఏడాది ఆగస్టులో ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్‌గా అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు తహసీల్దార్ భవనం కాస్తా ఆర్డీఓ కార్యాలయం భవనంగా ప్లాన్‌లో మార్పులు చేర్పులు చేశారు. దాంతో రూ.60లక్షలతో మొదలు పెట్టిన భవనం ఆ నిధులు ఉన్న వరకు పనులు చేపట్టి వదిలేశారు. ఆర్డీఓ కార్యాలయం నమూనాకు రూ.35 లక్షలు అదనంగా కావాల్సి ఉంది. కేవలంలో రూ.60లక్షలతో చేపట్టిన పనులు అక్కడి వరకు పూర్తి చేయగా కాంట్రాక్టర్‌కు ఐటీడీఏ ద్వారా రూ.35 లక్షలు బిల్లులు డ్రా చేసి ఇచ్చారు. మిగతా రూ.25లక్షలు రావాల్సి ఉండగా ఇప్పుడు ఆ భవనం పూర్తి కావాలి అంటూ అదనంగా మరో రూ. 35లక్షలు నిధులు కావాల్సి ఉందని ఇంజనీరింగ్ అధికారులు ఎస్టిమేట్‌లు తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. కానీ ఇప్పుడు అదనంగా రూ. 35 లక్షలు ఏ ఫండ్ నుంచి ఇవ్వాలని తర్జన బర్జన పడుతున్నారు. దాని వల్ల తహసీల్దార్, ఆర్డీఓ భవనం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

రికార్డులకు భద్రత కరువు

మండల రెవెన్యూ కార్యాలయంలో రికార్డుల గదులు పగుళ్లు తేలి నెర్రలుబాసి ఉన్నాయి. అందులోనే రికార్డులు నిల్వ చేసి ఉంచారు. వర్షం వస్తే వాటికి తడుస్తున్నాయని పలువురు వాపోతున్నారు. దీంతో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల చిట్టా, దస్తావేజులు, దత్రాలు, రికార్డులు, పహానీలు ఇతరత్ర ముఖ్యమైన కాగితాలకు భద్రత కరువైంది. వాటిని పొందు పర్చడానికి సరైన రికార్డు రూమ్ లేకపోవడంతో అభద్రత భావంతో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. అధికారులు సైతం వారి వారి విధుల సమయంలో ఉన్న రికార్డులకే రక్షణ కల్పించుకొని మిగతా వాటిని గాలికివదిలేశారు. దీనివల్ల పూరాతనమైన దస్తావేజులు, పహానీలు భద్రమేనా అనే అనుమానాలు రెకెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఆర్డీఓ కార్యాలయం భవనం పూర్తి చేయాలని ఏజెన్సీ ప్రజలు కోరుతున్నారు. సక్రమంగా కార్యాలయం లేకపోవడంతో పనులు కూడా ముందుకు సాగడం లేదని అనుమానాలు తలెత్తుతున్నాయి. గతంలో కార్యాలయం రోడ్డుకు దగ్గరల్లోనే ఉండేది. ఇప్పుడు సుమారు కిలోమీటరు లోపటికి నడుచుకుంటూ వెళ్లాల్సి దుస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. కొత్త భవనం పూర్తి చేసి రెవెన్యూ కార్యాలయాన్ని అక్కడి మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



రికార్డులు ఉంచిన గదికి బీటలు వారిన గోడలు

నేరాల నివారణ అందరి బాధ్యత



గ్రామసభలో మాట్లాడుతున్న సీఐ శంకర్

ములుగు రూరల్: గ్రామాల్లో నేరాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని సీఐ శంకర్ అన్నారు. మండలంలోని కన్నాయిగూడెం, అంకన్నగూడెం గ్రామాల్లో ఎస్సై వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించగా సీఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామ స్థాయి అధికారులను సమావేశంలో భాగస్వామ్యం చేస్తూ గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలు ఎదురైతే ప్రజలు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావచ్చని అన్నారు. మధ్యవర్తులను తీసుకురాకూడదని తెలిపారు. సమస్యల పరిష్కారానికి పోలీసులు తమవంతు తోడ్పాటును అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

వెంకటాపురం(ఎం): ఉద్యోగులకు బదిలీలు సహజమని ఐఎన్‌టీయుసీ 327 జిల్లా అధ్యక్షుడు దండు రాంచందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బదిలీపై వెళ్తున్న ఏఈ సురేష్, ఎల్‌ఐలు వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి, లైన్‌మెన్ వేణుగోపాల్‌రెడ్డిలను సన్మానించారు. ఈ కార్యక్రమానికి సబ్ ఇంజనీర్ సాంబరాజు అధ్యక్షత వహించగా జిల్లా అధ్యక్షుడు రాంచందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల సమస్యలను, రైతు సమస్యలను పరిష్కరించడంలో కృషి చేసిన అధికారుల సేవలను కొనియాడారు. ఎస్ఎల్ఐ ఉదయ్‌భాస్కర్, ఎల్ఐ మల్లారెడ్డి, ఎల్ఎం రాజేష్, ఎఎల్ఎంలు రాజు, రమేశ్, లక్ష్మణ్, కృష్ణాకర్, సురేష్, వేణు, గాలి రాజు, సూరయ్య పాల్గొన్నారు.



ఎల్ఎం వేణుగోపాల్‌రెడ్డి సన్మానిస్తున్న సిబ్బంది

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మల్హర్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొయ్యూరులో గ్రామంలో కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కొయ్యూరు పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బృందాలుగా ఏర్పడి ఇంటింటా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తులను విచారించారు. పత్రాలు లేని సరిగా, నంబర్ ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో డీఎస్పీ సమావేశం నిర్వహించి గంజాయి, గుడుంబా, సైబర్ నేరలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో అపరచిత వ్యక్తలు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామంలో ఎలాంటి చట్ట విరుద్ధమైన కార్యక్రమాలకు, పనులకు చోటు ఇవ్వద్దని పేర్కొన్నారు. ప్రజల మేలు కోసమే కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆయన వెంట కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు



బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

వాజేడు: ప్రమాదాలను నివారించడం కోసం మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామం వద్ద పోలీసులు మంగళవారం బారికేడ్లను ఏర్పాటు చేశారు. గ్రామం వద్ద హైవేపై రోడ్డుపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దసరా పండుగ రోజున జగన్నాథపురం వద్ద ట్రాక్టర్, కారు ఢీకొన్న ఘటనతో ప్రమాదాల నివారణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై రుద్రారపు హరీష్‌లు గ్రామానికి రెండు వైపుల బారికేడ్లను ఏర్పాటు చేశారు. హైవేపై వచ్చి వెళ్లే వాహనాల వేగాన్ని నియంత్రించడం కోసం వీటిని ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్యాధికారి స్నేహ మహిళలకు మంగళవారం వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె 24 మంది మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షల కోసం ములుగు ఏరియా వైద్యశాలకు పంపించారు. అలాగే మండల పరిధిలోని నూగూరు, మంగవాయి, వీరభద్రవరం, శివాపురం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్యాధికారులు అశిష్, సొహెల్, పవన్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

చిట్యాల: మండలంలో ఇద్దరి వ్యక్తుల సెల్‌ఫోన్లను ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించడంతో వాటిని సీఈఐఆర్ ద్వారా గుర్తించి బాధితులకు అప్పగించినట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని ముచినిపర్తికి చెందిన రాజిరెడ్డి తన సెల్‌ఫోన్‌ను ఆరు నెలల క్రితం తన ఇంటి ముందు పెట్టి ఇంట్లోకి వెళ్లి వచ్చేలోపే ఎవరో తీసుకెళ్లారు. అలాగే చిట్యాలకు చెందిన టేకు లక్ష్మయ్య మూడు నెలల క్రితం భూపాలపల్లి బస్సులో వెళ్తున్న క్రమంలో ఎవరో గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఈ మేరకు వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీస్ సిబ్బంది కొమల, మమత, లాల్‌సింగ్‌లు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు అప్పగించామని ఎస్సై తెలిపారు. పదిరోజుల వ్యవధిలోనే ఐదు సెల్ ఫోన్లు గుర్తించి అప్పగించడం జరిగిందని పేర్కొన్నారు.



సెల్ ఫోన్‌లను అప్పగిస్తున్న ఎస్సై శ్రావన్‌కుమార్

దుండగులను కఠినంగా శిక్షించాలి

చిట్యాల: వరంగల్‌లోని దేశాయిపేట్‌లో ఉన్న మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం సిగ్గమాలిన చర్య అని అలాంటి దుండగులను గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ యువజన సంఘం సాంస్కృతిక కార్యదర్శి జన్నె యుగేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో నాయకులు నిరసన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహాత్మాజ్యోతిరావు పూలే హక్కుల కోసం నిరంతరం కృషి చేశాడని అలాంటి వ్యక్తి విగ్రహాన్ని ధ్వంసం చేయడం అన్యాయమని అన్నారు. గతంలో విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను శిక్షించకపోవడం మూలాంగానే ఈ పరిస్థితి నెలకోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికై నా విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేష్, ఏవైఏస్ మండల అధ్యక్షుడు సరిగొమ్ముల రాజేందర్, నాయకులు బొడు ప్రభాకర్, కనకం తిరుపతి, బోట్ల అనందం, నేరేళ్ల సమ్మయ్య, రమేష్, పెచయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

రైతులకు పరిహారం చెల్లించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు



ఎండిపోయిన పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

గోవిందరావుపేట: మండలంలోని లక్నవరం చెరువు కింద శ్రీరాంపతి కాలువ చివరి ఆయకట్టుకు నీరందక పంట ఎండిపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేల నష్ట పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎండిపోయిన పంట దుబ్బులతో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి 2 గంటల పాటు ధ ర్నా నిర్వహించారు. గాంధీనగర్, మొద్దులగూడెంలో ఎండిపోయిన వరి పొలాలు వద్దకు మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్‌లు వెళ్లి వారిని పరామర్శించి, రైతులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలువలకు గండ్లు పడి శ్రీరాంపతి కాలువ నీరు చివరి ఆయకట్టు సాగుకు నీరు అందడం లేదని, నీరు అందక పొలాలు ఎండిపోతున్నాయి అన్నారు. ఇప్పటికే 70 ఎకరాల వరకు పూర్తిగా ఎండిపోయింది అని వాపోయారు. మంత్రి సీతక్క వెంటనే కాల్వల లైనింగ్ వర్క్‌లు చేయించడం కోసం, కాలువలో షిల్ట్ తీయించడం కోసం నిధులు కేటాయించాలి, యుద్ధ ప్రతిపదికన పనులు పూర్తి చేయించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి రైతు సంఘం కమిటీ సభ్యుడు తుమ్మల వెంకట్ రెడ్డి తహసీల్దార్ సృజన్ కుమార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన తహసీల్దార్ అగ్రికల్చర్ ఏఓకి ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించమని ఆదేశాలు జారీ చేశారు. తీగల ఆదిరెడ్డి, పాదిళ్ల చిట్టి బాబు, రసుపుత్ రవీందర్, మారబోయిన సారయ్య, బాలు, శ్రీను, బీఆర్ఎస్ పార్టీ నాయకులు లావుడ్య రాంచందర్, చందులాల్, శ్రీనివాస చారి, గట్టయ్య, నాయక్, సంతోష్, రాజేశ్వరీ, రఘు, వీరయ్య, లక్ష్మణ్, మార్య, కొమురయ్య, రాములు, కాశీం పాల్గొన్నారు.

'చర్య తీసుకోవాలి'

కాటారం: కాటారం మండలం చిద్నెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా కూల్చివేసిన కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరన్ డిమాండ్ చేశారు. కూల్చివేసిన పాఠశాల భవనాన్ని మంగళవారం స్మరన్ పరిశీలించి మాట్లాడారు. కలెక్టర్, డీఈఓ నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా భవనం కూల్చివేయడం చట్టవిరుద్ధం అన్నారు. ప్రభుత్వ భవనాలు కూల్చివేయాలంటే సంబంధిత శాఖ అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని అన్నారు.

ఆర్థిక సాయం

చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన డబ్బాల దేవేందర్ ఇటీవల అనారోగంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి శ్రీమిత్ర ఫౌండేషన్ చైర్మన్ అట్టెం రమేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రూ. 10వేలతో పాటు ఇరవై ఐదు కిలోల బియ్యం, ఐదు కిలోల వంట నూనే అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మత్స్యకారులకు శ్రీమిత్ర ఫౌండేషన్ అండగా ఉంటుందని తెలిపారు. గ్రామ మత్స్యపారిశ్రామిక సహాకార సంఘం అధ్యక్షుడు రామన్న, నర్సయ్య, మొగిలి, సమ్మయ్య, శంకర్, చంద్రయ్య, మండల యూత్ అధ్యక్షుడు వెంకటేశ్, సొసైటీ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

ఏజెన్సీలో కమిటీల ఎంపిక రాజ్యాంగ విరుద్ధం



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మంగపేట: ఏజెన్సీ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ కమిటీలను నియమించడం రాజ్యాంగ విరుద్ధమని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మండల అధ్యక్షుడు డబ్బుల ముత్యాలరావు అన్నారు. మండలంలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 33కు నిరసనగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన ప్రజా సంఘాల నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాలరావు మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 ప్రకారం ఫిఫ్త్ షెడ్యూల్ భూ భాగంలో 1/70, 1/59, పీసా చట్టం అమలులో ఉన్నందున ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ ఏజెన్సీ ప్రాంతానికి వర్తించకుండా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పీసా గ్రామసభల ద్వారనే ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో కమిటీల పేరుతో చేస్తున్నటువంటి చర్యలను తీము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తోలెం నర్సింహారావు, రమేశ్, తిరుమల్‌రావు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్ నూతన ప్రిన్సిపాల్‌గా పూర్ణచందర్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన దూడ వెంకటేశ్ సాధారణ బదిలీల్లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన పూర్ణచందర్‌కు పలువురు ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయతీ పేరుతో వసూలు చేస్తే చర్యలు



ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తున్న కార్యదర్శి స్వాతి, సిబ్బంది

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం మద్దులపల్లి ఇసుక క్వారీ నుంచి వస్తున్న లారీల నుంచి పంచాయతీ రుసుము పేరుతో పంచాయతీకి సంబంధం లేకుండా వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి స్వాతి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం గ్రామ పంచాయతీ, గ్రామశివారు, కాంటా వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. లారీ డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఎవరైన పంచాయతీ పేరుతో అక్రమంగా వసూళ్లకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.